నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | ఆగస్టు 12, 2024 | www.navatelangana.com

ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్



శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం 3583 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా సాగు కోసం ప్రాజెక్టు కాలువలకు నీటి విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం కాకతీయ కాలువతో పాటు సరస్వతి, లక్ష్మి కాలువలకు మొత్తం 3583 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతోంది.

ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5 టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1080.80 అడుగుల(47.25 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

అంగట్లో ఆగమాగం..
తూకం, ధరల్లో మోసాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌లో ప్రతి ఆదివారం సండే మార్కెట్ పెద్దఎత్తున జరుగుతుంటది. అయితే పలువురి ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని పలువురు వ్యాపారులు మోసాలకు తెరతీస్తున్నారు. ధరలతో పాటు తూకాల్లో మోసం చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. మార్కెట్లో వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఎన్నో ఆరోపణలు వస్తున్నాయి. కాని సంబంధిత శాఖ అధికారులు కనీసం తనిఖీలు చేయడం లేదు. సండే కావడంతో ప్రభుత్వ సెలవు దినం. దాంతో అధికారులు విధులలో ఉండరనే ధీమాతో వ్యాపారులు అందిన కాడికి దండుకుంటున్నారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి బోధన్ మార్కెట్లో తనిఖీలు జరిపి వినియోగాలను మోసం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



గుంతలను పూడ్చుతున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

గుంతలను పూడ్చిన అధికారులు

- నవతెలంగాణ వార్తకు స్పందన


రోడ్డు గుంతల మయం
• తరుచూ ప్రమాదాలు • పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బోధన్ బాన్సువాడ వెళ్లే రహదారిపై వర్షం నీటితో ఏర్పడిన గుంతలను అధికారులు పూడ్చారు. నవతెలంగాణ పత్రికలో ప్రచురితమైన రోడ్డు గుంతల మయం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్అండ్ బి అధికారులు స్పందించారు. ఆదివారం సాయంత్రం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్, అలాగే బొమ్మన్ దేవ్ పల్లి చౌరస్తా వద్ద ఏర్పడిన గుంతల పూడ్చారు. జనసంచారం, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాన్సువాడ బోధన్, నిజామాబాద్ వెళ్లే వాహనదారులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. బస్టాండ్ వద్ద గుంత ఏర్పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగాయి. ఈ గుంతల వల్ల ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై కథనం ప్రచురితం రావడంతో బాన్సువాడ డివిజన్ ఆర్అండ్ బి అధికారులు స్పందించి నసురుల్లాబాద్ బస్టాండ్ ఎదుట ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో పరిశీలించిన అధికారులు ఆయా ప్రాంతాలకు మొబైల్ వాహనాన్ని పంపించి సిబ్బందితో రోడ్లను పూడ్చి వేయించారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు అవసరం ఉన్నవాటిని సైతం పూర్తిచేశారు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించారు.

బీర్కూర్‌లో ఘనంగా గంప జాతర

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండల కేంద్రంలో గైపీర్ల దర్గా గంప జాతరను ఆదివారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపిపి రఘు ఆధ్వర్యంలో నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గైపీర్ల వద్ద సమర్పించి ప్రజలు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రఘు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి ఏటా ఈ పండుగను నిర్వహిస్తామన్నారు. ఈ జాతరకు బీర్కూర్ మండల చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వస్తారు.

పోచారం ఇలాకాలో అవినీతి కంపు



తలుపులు లేకుండా శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

- విద్యార్థుల నిధుల్లో కక్కుర్తి
- అమ్మ ఆదర్శ పనుల్లో ఎవరి వాట ఎంత ?
- తూతూ మంత్రంగా అమ్మ ఆదర్శ పనులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పథకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం లక్ష్యం నెరవేరడంలేదు. విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించడం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకపోయింది. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పని చెయ్యడం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించవలసిన ఇంజనీర్లు కాసులకు కక్కుర్తి పడ్డారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బాన్సువాడ డివిజన్ పరిధిలో ఉన్న నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మూడు మండలాలకు 2 కోట్ల 45 లక్షలు నిధులు మంజూరు కాగా, తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. కోట్ల డబ్బులు ఖర్చు అయినా కనీస సౌకర్యాలు కల్పించకుండా నిధులు ఖర్చు అయ్యాయి.

కొత్తగా కొలువుదీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ప్రభుత్వ స్కూళ్లల్లో సౌకర్యాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో నేరుగా స్కూళ్లలోల కమిటీలు ఏర్పాటు చేసింది. స్కూళ్లల్లో కల్పించాల్సిన సౌకర్యాలను కమిటీ గుర్తించిన పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు



వాటర్ ప్యూరిఫైయర్‌కు బదులు నీటి డబ్బానే..

కేటాయించింది. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలంలోని 20 పాఠశాలకు 54 లక్షల 22 వేలు, నసురుల్లాబాద్ మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలకు 64 లక్షలు, బాన్సువాడ మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలకు 1కోటి 22 లక్షలు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

నిధులు మంజూరు చేసినా లక్ష్యం నెరవేరకుండా పోయింది. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ నిధులను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, గ్రామ మహిళ సమాఖ్య సభ్యురాలు కలిసి పని చేయాల్సి ఉండగా చాలా చోట్ల వీరి ఇద్దరికీ కొంత శాతం వాటా ఇచ్చి కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారు. ఇందులో పూర్తిస్థాయి నాసిరకం పనులు జరిగాయంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇందులో కొందరు కాంట్రాక్టర్లు పనులు చేసిన డబ్బులు రావడం లేదని, అప్పులు చేసి పనులు చేస్తే బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోచారం కృషి.. అధికారుల నిర్లక్ష్యం

బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధికి మాజీ స్పీకర్ పోచారం ఎనలేని కృషి చేస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పోచారం ఆశయం నెరవడం లేదు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించవలసిన అధికారులు కుర్చీలకే పరిమితం కావడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల పేరుతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. పాఠశాలలో తాగునీటి, మరుగు దొడ్లు, ఎలక్ట్రిసిటీ, చిన్న చిన్న మరమ్మతు పనులు కావొచ్చు ఏదైనా సరే నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసి తూతూ మంత్రంగా పనులు కానివ్వడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది అనే సామెతగా మారింది. సంబంధిత కాంట్రాక్టర్ నయానో భయనో చెప్పి అధికారులను తన దారిలోకి తీసుకున్నట్లు సమాచారం. తమ మాట వినని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు జరిపినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పనులు పూర్తి చేయకుండా బిల్లులు కాజేసిన కాంట్రాక్టర్ మరియు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు.



పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరిన స్కూల్





స్కావెంజర్లు లేక.. చీపుర్లు పట్టి ఊడుస్తున్న విద్యార్థులు



నీరు నిలిచి మురుగుగా మారిన స్కూల్ ప్రాంగణం

మూడు దశాబ్దాల కల నెరవేరింది

- ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బిచ్కుంద

ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు చేసిన పోరాటంతో కల నెరవేరిందని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగుపడతాయని మాదిగలు అందరూ ఐక్యమత్యంగా ఉండి జాతి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. బిచ్కుంద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, అన్నా భావు సాఠె, బసవేశ్వర్ మహరాజ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు మంత్రివర్యులు దామోదర రాజ నరసింహ నేతృత్వంలో తనతో పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగ ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టులో వాదనలు వినిపించామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతోన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియలో కూడా మాదిగ, మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు చేపడుతామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, సీనియర్ నాయకులు మల్లికార్జున అప్ప, పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, పిసిసి డెలికేట్ విట్టల్ రెడ్డి, దండోరా నాయకులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



దప్పుల దరువులతో తరలుతున్న నాయకులు

మద్నూర్ : ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు తీర్పు చెపుతూ రిజర్వేషన్లు అమలు కోసం రాష్ట్రాలకు అధికారం ఇవ్వడం తెలంగాణ రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పుకు వెంటనే అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో ప్రకటించిన సందర్భంగా ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ బిచ్కుంద మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. మద్నూర్ మండలం నుండి గ్రామ గ్రామం నుండి డప్పులతో ఎమ్మార్పీఎస్ నాయకులు బిచ్కుంద కు తరలి వెళ్లారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం

- పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్యకు చేసుకున్న రైతు కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమిస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, రూ.10 లక్షలు ఎక్స్ గ్రేసియ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న యువ రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని తెలంగాణ రైతు సంఘం నాయకులు ఆదివారం పరామర్శించి వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ జీవనం సాగించడానికి తనకు ఉన్న కొంత భూమిలో వ్యవసాయం చేస్తున్న రాజేష్ సాగులో నష్టాలు రావడంతో కుటుంబపోషణకు గల్ఫ్ దేశం పోయినట్టు తెలిపారు. అప్పులు తీర్చి తిరిగి వచ్చాక.. అప్పు చేసుకొని స్థానికంగా వ్యాపారం చేసుకోవడానికి ఇటుక బట్టి పెట్టి అందులో కూడా నష్టపోయి అప్పు పెరిగినట్టు తెలిపారు. దాన్ని కట్టాలని ఒత్తిడి చేయడంతో.. కడుతాని హామీ ఇచ్చినా తనకు ఉన్న కాస్త పొలాన్ని అమ్మి ఇస్తా అని చెప్పిన ఆ భూమి తన పేరు మీద కాకపోవడంతో తన పేరు మీద అయ్యేంతవరకు వేచి చూడాలని ప్రాధేయపడిన ఫైనాన్స్ వ్యాపారులు వినకుండా ఆయనను మానసికంగా శోభకు గురిచేసారని తెలిపారు. ఈ వేదనను తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకునే ముందు తన గ్రామ సోషల్ మీడియా గ్రూప్ లో ఆడియో మెసెజ్ కూడా పెట్టాడని వాళ్ళ కుటుంబ సభ్యులు తెలిపారని వారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తన పొలం ధరణి లోకి ఎక్కకపోవడం వల్ల వారికి రైతు బీమా కూడా రాదు అని కావున దీన్ని ప్రభుత్వ తప్పుగా పరిగణించి వారికి రైతు బీమా ఇవ్వాలని డిమండ్ చేశారు. ఫైనాన్స్ వ్యాపారుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న నాయకులు ఎర్రన్న, గణేష్, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

రెచ్చిపోతున్న మొరం మాఫియా

- అడ్డుకుంటే పోలీసుల ఎదుటే పిడిగుద్దులు
- హాలిడే రోజు రాత్రింబవళ్లు మొరం దందా
- మామూళ్ల మత్తులో అధికారులు
- ప్రభుత్వం మారిన బీఆర్ఎస్ మాఫియాదే హవా

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ మండల కేంద్రంలో మొరం మాఫియా రాత్రింబవళ్లు అక్రమ రవాణా చేస్తూ అడ్డొచ్చిన వారిపై దాడులకు దిగుతున్నారు. శనివారం రాత్రి బీఆర్ఎస్ నాయకుడు అజ్జు, నాగేపూర్ ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి హాలిడే రోజు జోరుగా అక్రమ మొరం తరలిస్తుండగా యువకుడు శేఖర్ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో ఇద్దరు వ్యాపారస్తులు అతన్ని పట్టుకొని పిడుగుద్దులతో దాడికి పాల్పడ్డారు. పోలీసుల ఎదుటే వీడియో తీస్తున్నా రెచ్చిపోయి మద్యం మత్తులో చంపేస్తామంటూ దాడులకు దిగడం నవీపేట్‌లో మొరం మాఫియా తీరుకు అద్దం పడుతుంది. గతంలో సైతం వ్యాపారస్తుల మధ్య విభేదాలు రావడంతో దాడులకు దిగిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు మీడియాను మచ్చిక చేసుకుని వ్యాపారాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తు న్నారు. గత బిఆర్ఎస్ హయాంలో ప్రజాప్రతినిధుల అండదండలతో గుట్టలను చదును చేసి లక్షల రూపాయల అర్జించి మొరం దందాకు అలవాటు పడ్డారు. బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం మారినా తమ దందాను కొనసాగించడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి నవీపేట్‌లో మొరం మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. దాడి ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



కొట్టుకుంటూ తరుముతున్న వైనం



టిప్పర్ ఎదుట వ్యక్తిపై దాడి చేస్తున్న పలువురు

రైల్వే స్టేషన్లో నల్లబెల్లం, పటిక పట్టివేత



నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రైల్వే స్టేషన్లో నల్లబెల్లంను పట్టుకున్నట్లు ఆర్పీఎఫ్ రైల్వే సిఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ ఆర్పీఎఫ్, జీఆర్పీ ప్రత్యేక బృందాలు 17057 నంబర్ ట్రైన్ లో తనిఖీ చేయగా, ఒక బోగిలో సీటు కింద మూడు నల్లబెల్లం సంచులు, ఏడు పటిక సంచులున్నట్లు గుర్తించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకొని నిజామాబాద్ ఆర్పీఎఫ్ పోస్టుకు తరలించారు. రైల్వే పోలీసులు ప్రత్యేక బందంతో పాటు ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మూడు నల్లబెల్లం సంచులు, 7 పటికలను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. 120 కేజీల నల్లబెల్లం విలువ సుమారు రూ.9600 ఉంటుందని అలాగే 250 కేజీల బరువు గల పటిక విలువ రూ.10వేలు ఉంటుందని తెలిపారు. మొత్తం వీటి విలువ రూ.19,600 ఉంటుందని సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

గ్రంధావిష్కరణ.. కార్యక్రమంలో పాల్గొన్న తనికెళ్ల భరణి



కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు తనికెళ్ల భరణి

నవతెలంగాణ-ఆర్మూర్

యశస్విని సాహితీ సమితి వారు ఆదివారం పట్టణంలో గ్రంధావిష్కరణ కార్యక్రమం నిర్వహించినారు. విశ్వవిఖ్యాత నటులు, ఆధ్యాత్మికవేత్త, దర్శకులు డాక్టర్ తనికెళ్ళ భరణి ముఖ్యఅతిథిగా విచ్చేసి తన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇండిపెండెన్స్ డే' లింకుల పట్ల జాగ్రత్త

- సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం : నగర సీఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సైబర్ నేరగాళ్లు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 'హ్యాపీ ఇండిపెండెన్స్ డే' అంటూ మెసేజులు పంపుతూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రివార్డ్ వచ్చిందని లింకులు పంపిస్తారని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని నిజామాబాద్ టౌన్ సిఐ నరహరి సూచించారు. అవి ఓపెన్ చేస్తే బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులు మాయం అవుతాయని తెలిపారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఎవరూ క్యాష్ బ్యాక్ పంపరని, అలాంటి లింకులు ఓపెన్ చేయొద్దని సూచించారు.

ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ కంచె ఏది?

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటుచేసిన ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ కంచే ఏర్పాటుచేయక పోవడంతో అది ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్ ఫార్మర్ బిగించి ట్రాన్స్ కో అధికారులు దాని చుట్టు రక్షణ కంఎబ ఏర్పాటుచేయడం మాత్రం మరిచారు. దాంతో అది ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో ప్రమాదవశాత్తు పశువులు, మనుషులు తాకిన ప్రాణాలకే ప్రమాదం జరిగేలా ఉంది. కావున సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్ ఫార్మర్ కు రక్షణ కంచే ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.


కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

పెర్కిట్ రహదారిపై లారీ బోల్తా

- తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారిపై టమాట లోడుతో వెళ్తున్న లారీ ఆదివారం ఉదయం బోల్తా పడింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి ఉత్తరప్రదేశ్ కు వెళ్తున్న ఈ లారీ పెర్కిట్ మహిళ ప్రాంగణం దాటిన తర్వాత స్లిప్పు కావడంతో బోల్తా పడింది. కాగా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.


బోల్తా పడిన టమాట లారీ

విరాళాల సేకరణ


మాట్లాడుతున్న ఏశాల గంగాధర్

నవతెలంగాణ -బోధన్

కేరళ రాష్ట్రంలోని మయనాడ్ లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి భారీ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగి చాలామంది నిరాశ్రయులుగా మిగిలారు.దాంతో వారిని ఆదుకోవాలనే ఉద్దేశతో ఎస్.పీ.ఆర్.డీ వికలాంగులసంఘం, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. బోధన్ ఉమ్మడి మండలంలోని పెంటాఖుర్దు, సాలంపాడ్, కల్దుర్కి, రాంపూర్, బండార్‌పల్లి గ్రామాల్లో సిపిఐఎం పార్టీ బోధన్ ఏరియా కమిటీ, ఎస్‌పీఆర్‌డి బోధన్ ఏరియా కమిటీ నాయకులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఐఎం పార్టీ బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం ఏరియా కమిటీ కార్యదర్శి ఏశాల గంగాధర్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక బోధన్ ఏరియా కార్యదర్శి గైని రాములు, రామ్ పటేల్, సాయినాథ్ , చింటూ, ఎల్లయ్య, పోచవ్వ, భూమవ్వ, సావిత్రి శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, భూమవ్వ, గంగారెడ్డి, రవికాంత్ రెడ్డి, గంగామణి, సంజీవ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్ దితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నాగనాథ్‌ను ఆదివారం సాలురా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంధర్నా రవి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు అల్లే రమేష్ , యూత్ అధ్యక్షులు ఖాజాపూర్ అశోక్, కుమ్మన్ పల్లి నరేందర్ రెడ్డి, మంధర్నా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహం ప్రతిష్టాపన


సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటుచేయించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ జిల్లా ప్రభుత్వ పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో "శ్రీ సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు గతంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఇటీవల పాఠశాల మరమ్మత్తుల్లో భాగంగా తిరిగి మరల నూతనంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు గంగారాం, రిటైర్డ్ ఉపాధ్యాయులు పుష్పనాథ్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పూర్వవిద్యార్థులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, టి.రాజేష్, శ్రవణ్ కుమార్, గాదె శ్రీనివాస్, పద్మాలత, వెంకట లక్ష్మీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డి మరణం సమాజానికి తీరని లోటు

- మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి


నివాళ్లు అర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్


ప్రముఖ సమాజ సేవకుడు రాజారెడ్డి (పైపుల రాజిరెడ్డి) మరణం సమాజానికి తీరని లోటని మాజీ మంత్రులు, బాల్కొండ, సూర్యాపేట ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్మూర్ మండలం అంకాపూర్ లాలన ఆశ్రమంలో జరిగిన రాజారెడ్డి అంతక్రియలకు హాజరై పార్థీవ దేహానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎందరో పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం చేశారని, లాలన వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి నీడ లేని ఎందరో వృద్ధులకు బాసటగా నిలిచారంటూ రాజారెడ్డి చేసిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేరుకున్నారు. సమాజ హితాన్ని కోరుకునే వారు మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. రాజారెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


నివాళి అర్పిస్తున్న వేముల

లెఫ్టు.. రైటే
ఎడమ చేతి వాటానికి ప్రత్యేక గుర్తింపు

- రేపు ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా...

నవతెలంగాణ-ఆర్మూర్



కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నట్లు ఎడమచేతి వాటం కలవారు ఎందరో ఎదురులేని విజయాలను సొంతం చేసుకున్నారు. కొందరికి జన్యుపరంగా ఎడమ చేతి వాటం అలవాటైతే పసి వయసులోనే ఎడమ చేయి వాడడం అదే అలవాటుగా మారిన వారు ఇంకొందరు.. కుడి చేతితో పనులు చేసే వారికి ధీటుగా ఎడమచేతి వాటం వారు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారు..

1976 సంవత్సరంలో..

అంతర్జాతీయ ఎడమ చేతి వినియోగ దినోత్సవం 1976 సంవత్సరంలో మొదటిసారి నిర్వహించారు. 1996 ఆగస్టు 13న ఇది అమలులోకి వచ్చింది. లెఫ్ట్ హ్యాండర్స్ పేర్లను నమోదు చేశారు. అయితే లెఫ్ట్ హ్యాండ్స్ ను ఏ మాత్రం చిన్నచూపు చూడాల్సిన అవసరం లేదని వారు నిరూపిస్తున్నారు. అమెరికా దేశానికి ఇప్పటివరకు పనిచేసిన 44 మంది అధ్యక్షుల్లో 8 మంది లెఫ్ట్ హ్యాండ్స్ వారే ఉన్నారు. జెన్సి గార్ఫిట్, అర్థన్, రోనాల్డ్ రీగన్, ఒబమా, జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్, బిల్ క్లింటన్, ప్రముఖ క్రికెటర్లు ఆలెన్ బోర్డర్, అలిస్టార్ క్యాంప్ బిల్, డేవిడ్ గోవ రూలతో పాటు సౌరబ్ గంగూలీ లెఫ్ట్ హ్యాండర్స్ ఎన్నో విజయాలు సాధించారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు లక్ష్మీ మిట్టల్, రతన్ టాటా ఇలా చాలామంది ఎడమ చేతివాటం కలిగిన వారు ఉన్నారు. వీరు ప్రపంచ జనాభాలో సుమారు 10శాతం మంది ఉన్నట్లు తెలుస్తోంది. సచిన్ టెండుల్కర్, అమితాబచ్చన్ వంటి ప్రముఖులు ఎడమచేతి వాటం కలవారే.

ఎటువంటి ఇబ్బంది లేదు..



చిన్ననాటి నుంచి ఎడమ చేతితో రాయడం అలవాటయింది. కుడి చేతితో రాసే వారితో పోటీపడే వారిని ఎడమ చేయి అనే ఇబ్బంది ఎప్పుడూ రాలేదు.. ప్రపంచంలో ఎంతోమంది ఎడమచేతితో తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్నారు. కుల వృత్తితో పాటు వుడ్ కార్వింగ్ ఎడమ చేతితోనే చేస్తున్నాను.

ఎస్.వడ్ల ప్రణీత్, ఓం గాయత్రి కార్వింగ్ వర్క్స్, పెర్కిట్.

ప్రముఖులకు ఆదర్శంగా...



ఎడమ చేతిరాత అలవాటు అదృష్టమే. ఎడమ చేతి అలవాటు ఉన్నవారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. వారి స్ఫూర్తి నాలో నింపింది కష్టపడి చదివి విధులు నిర్వహిస్తూ విద్యార్థిని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నా.

కవిత, ప్రాధనోపాధ్యాయురాలు, కోమన్‌పల్లి.

లంచావతారులపై ఉక్కుపాదం

- అధికారుల్లో మార్పు వచ్చేనా?

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా కార్పొరేషన్ రెవెన్యూ ఇంచార్జ్ ఆఫీసర్ నరేందర్‌ను ఎసిబి అధికారులు పట్టుకొని 6.7 కోట్ల విలువైన నగదు ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ఉమ్మడి జిల్లాల్లోనే తీవ్ర చర్చాంశానయం అయింది .

ప్రధాన శాఖలపై ఏసీబీ ఫోకస్...

ఉమ్మడి జిల్లాపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అవినీతికి అండగా నిలిచే ప్రధాన శాఖలపై ఫోకస్ పెట్టారు. ఆరు ఏడు నెలల నుండి పలుచోట్ల దాడులు నిర్వహించి కేసులు సైతం నమోదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులు రెవెన్యూ పోలీస్ శాఖ మున్సిపల్ శాఖలకు పరిమితం కాగా ప్రస్తుతం అన్ని శాఖల్లో జరుగుతున్న అవినీతిపై కన్నేశారు. ప్రస్తుతం అవినీతి తిమింగలాలు అన్ని శాఖలలో విస్తరించారు. చేతులు తడపనిదే పనులు కావడం లేదు దీంతో అధికారుల తీరుతో విసిగి వేసారేసిన బాధితులు ఏసీబీ నీ ఆశ్రయిస్తున్నారు.

అధికారుల వివరాలను..

ఉమ్మడి జిల్లాల్లో ప్రధానంగా రెవెన్యూ పోలీస్ ఎక్సైజ్ పంచాయతీరాజ్ నీటిపారుదల మున్సిపల్ రిజిస్ట్రేషన్ విద్యుత్ శాఖలలో అవినీతి ఆరోపణలు తరచు వినిపిస్తున్నాయి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారులపై ఏసీబీ దృష్టి సారించింది. సదరు ఉద్యోగి కుటుంబ సభ్యుల నుంచి ఆదాయ వివరాలను తెలుసుకొని వాటి తర్వాత ఉద్యోగికి వచ్చిన నెలసరి వేతనం వివరాలను పక్కాగా పరిశీలించిన తర్వాత అధికారులపై చర్యలు తీసుకుంటారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారుల వివరాలు ఏసీబీ అధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది.

పైసలు ఇస్తేనే పని..

ఒకవైపు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న అధికారులు అవినీతిని మాత్రం వదలడం లేదు. చేతులు తడిపితేనే పనులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి కేటాయింపులు చేస్తారని ప్రచారం ఉంది. డబ్బులు ఇవ్వని వారిని అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో పనుల కోసం వచ్చిన వారు ఎంతో కొంత ముట్ట చెబుతున్న సంఘటనలు ఉన్నాయి.

గత ఏడు నెలలలో చోటు చేసుకున్న సంఘటనలు

రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు చెక్పోస్టులలో తనిఖీలు చేయగా సాలూర మండలంలోని చెక్పోస్టులో లెక్క చూపని 12,000 లభించగా, కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని నార్త్ తహసిల్దార్ కార్యాలయంలో ఓ రైతు వ్యవసాయ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆర్ఐనీ ఆశ్రయించారు. దీనికి ఆర్ఐ డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసిబికి సమాచారం అందజేయగా 25 వేలు ఇస్తున్న సమయంలో వీఆర్ఏతోపాటు ఆర్ఐ రాజును ఏసీబీ అధికారులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. జక్రాన్ పల్లి మండలం లోని తొర్లికొండ గ్రామంలో ఓ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం పంచాయతీ కార్యదర్శిని బాధితుడు ఆశ్రయించగా డబ్బులు డిమాండ్ చేశాడు బాధితుడు ఏసీబీ వద్దకు వెళ్లగా డబ్బులు తీసుకుంటుండగా అధికారులు కార్యదర్శిని పట్టుకున్నారు కమ్మర్ పెళ్లి మండలంలోని ఓ అధికారి సర్వీస్ బుక్కులో సెలవులను పాస తేదీలలో రాయడానికి సీనియర్ అసిస్టెంట్ ఎంపీడీవో డబ్బులు డిమాండ్ చేశారు దీంతో ఏసీబీని ఆశ్రయించగా 10వేల ఇస్తున్న సమయంలో సీనియర్ అసిస్టెంట్ న అదుపులోకి తీసుకొని విచారించగాఎంపీడీవో ను బిక్నూర్ లో అదుపులోకి తీసుకున్నారు .

ఉమ్మడి జిల్లాలలోని ఏసీబీ అధికారుల వివరాలు..

టోల్ ఫ్రీ నెంబర్ 10 64... శేఖర్ గౌడ్ ఏసీబీ డిఎస్పి ఉమ్మడి జిల్లా 9154388950, ఏసీబీ సీఐ 9154388951, కామారెడ్డి ఏసీబీ ఎస్సై శ్రీనివాస్ 9154388953.

.డివిజన్ పరిధిలోని..

గతంలో పనిచేసిన ఆర్డీఓ, ఇంచార్జ్ సిడిపిఓ లతో పాటు మరికొందరిని ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాపాలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాలను పీక్కు తింటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి..

పనుల కోసం అధికారులు లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయాలి టోల్ ఫ్రీ నెంబర్ 10 64 కు సమాచారం ఇచ్చిన సరిపోతుంది లేకుంటే నేరుగా ఏసీబీ కార్యాలయానికి రావచ్చు.

శేఖర్ గౌడ్, ఏసీబీ డిఎస్పి, నిజామాబాద్.

చేపూర్ గ్రామంలో పిచ్చికుక్కల దాడి

- ఏడుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో పిచ్చికుక్కలు ఆదివారం స్వైర విహారం చేసి ఏడుగురికి తీవ్ర గాయాలు చేశాయి. కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని రాగా ప్రతిమ చికిత్స చేశారు. తీవ్ర గాయాలైన వేల్పుల నరసయ్య (50) కల (30), పోసాని(60), లత (40), రాజ గంగారం60), బట్టు లాస్య(45) మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద ఎక్కువగా ఉన్న పంచాయతీ కార్యదర్శి కానీ వీడీసీ సభ్యులు గాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే కుక్కలు దాడి చేశాయని బాధితుల బంధువులు ఆరోపించారు. ఇకనైనా గ్రామంలో సామాన్య ప్రజలకు కుక్కల బెడద నుండి రక్షించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

13నుంచి తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 13 నుంచి 14వరకు రెండు రోజుల పాటు తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాట్లు చేసినట్లు సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనను ఈ నెల 13న ఉదయం 10:45 గంటలకు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ మాట్లాడుతూ..ఈ ఎగ్జిబిషన్‌లో విదేశీ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి తెలుగు స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, కృషిని ప్రస్తుత తరానికి తెలియజేయడమే ఈ ఫోటో ఎగ్జిబిషన్ లక్ష్యం అని అన్నారు. ఈ ఫోటో ప్రదర్శనలో రాంజీగోండు, కుమురం భీం, చాకలి ఐలమ్మ స్వామి రామానంద తీర్థ, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు తదితరుల పాత్రను ప్రస్తుత తరానికి క్లుప్తంగా వివరిస్తుంది అన్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అదృశ్యమైన వ్యక్తి శవం లభ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలో అదృశ్యమైన వ్యక్తి బాసర గోదావరిలో శవమై కనిపించాడు. నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వినాయక్ నగర్ కు చెందిన కల్లెపల్లి రాజు(36) ఈ నెల 3 న కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు నాలుగవ టౌన్ పోలీసులు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. రాజు ఆచూకీ కోసం కుటుంబీకులు, పోలీసులు గాలించగా ఆదివారం బాసరలోని గోదావరి నదిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాధు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మూలన పడ్డ బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి.

బతుకమ్మ పండుగ సంద ర్భంగా అనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వం సరఫరా చేసిన సమయంలో కొన్నిచోట్ల ఆడపడుచులకు పంపిణీ చేసిన ఇంకొన్ని చోట్ల పంపిణీ చేయకపోవడంతో వెంటనే ఎన్నికల కోడ్ ఉందనే సాకుతో పంచకుండా కొన్ని చీరల కట్టలు కలిగిన సంచులు మిగిలిపోయాయి. వాటిని కొన్ని నెలలుగా ఇందల్ వాయి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలోనే కట్టలతో వచ్చిన సంచులు అలాగే ఉంచారు. ప్రస్తుతం అవి పనికి రాకుండా పోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ చీరలు నెలలు తరబడి మూలన ఉండడం పనికిరాకుండా పోతున్నాయని, ప్రజల పైసలు రాళ్లపాలు అయిన చందగా మారిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం మూలంగానే ఈ బతుకమ్మ చీరలు మూలన ములుగుతున్నాయని అంటున్నారు. ఇకనైనా స్పందించి ఆ బతుకమ్మ చీరల సంగతి తేల్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం సువర్ణను సంప్రదించగా తమకేమీ తెలియదని బతుకమ్మ పండుగ సమయంలో తమ కార్యాలయంలో చీరల సంచులను ఉంచడం జరిగిందని ఆ తర్వాత ఇప్పటికీ తీసుకొని వెళ్లలేదని సమాధానం ఇచ్చారు. ఇప్పుడు మిగిలిపోయిన ఈ చీరలు వచ్చే బతుకమ్మ పండుగ సమయంలో ఆడపడుచులకు పంచుతారా లేక ఎక్కడైనా పడవేస్తార అనే ప్రశ్న నెలకొని ఉంది.


పక్కన పెట్టేసిన బతుకమ్మ చీరల సంచులు

పెరిగిన కూరగాయల ధరలు

- తగ్గిన చికెన్ రేట్లు
- శ్రావణ మాసం ఎఫెక్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 5న శ్రావణ మాసం ఆరంభం కాగా కూరగాయలు, చికెన్ ధరల పై ఎఫెక్ట్ పడింది. దీంతో మాంసహార ప్రియులు మాత్రం ఖుషీ అవుతున్నారు. ఈ వర్షాకాలం సీజన్లో ఓవైపు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మరోవైపు చికెన్ ధరలు మాంసం ప్రియులకు అందుబాటులోకి వచ్చాయి. కూరగాయల మార్కెట్ కి వెళ్తే పెరిగిన ధరలను చూసిన సామాన్యుడు ఏమి కొనేటట్లు లేదు... ఏమి తినేటట్లు లేదు అన్న చందంగా తయారయిందని వాపోతున్నారు. చికెన్ ప్రియులకు మాత్రం చికెన్ వంటకాలు అందుబాటు ధరలోకి వచ్చాయి. కొంత మంది ఎక్కువగా చికెన్ వండుకునేందుకు ఇష్టపడుతున్నారు. గతంలో 200 రూపాయలు తీసుకొని కూరగాయల మార్కెట్ కు వెళితే సంచి నిండా వారానికి సరిపడ కూరగాయలు తెచ్చుకునేవారు. కానీ ప్రస్తుతం పెరిగిన ధరలు శాకాహారులకు చుక్కలు చూపెడుతున్నాయి. గత నెలలో రూ.260 నుంచి రూ.300 పలికిన చికెన్ ధరలు ప్రస్తుతం రూ.200, 220 లకు చేరుకున్నాయి. ప్రస్తుతం చికెన్ మార్కెట్లో లైవ్ కోడి కనిష్టంగా 160 రూపాయల ధర వలుకుతుండడంతో ఎంచక్కా ఎక్కువ శాతం మాంసాహారులు చికెన్ వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ నెల రోజులు ఇదేవిధంగా ఉంటుందని సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు.



తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర హాండ్ బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఎన్నికలు ఆదివారం ఢిల్లీ పబ్లిక్ పాఠశాల నాచారం, హైదరాబాద్ లో ఆదివారం నిర్వహించారని హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ తెలిపారు. ఈ సమావేశం గౌనె శ్యాంప్రసాద్ రావు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర హాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 2024 2028 సంవత్సరాలకు ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ ఎన్నికలకు హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రీత్ పాల్ సింగ్ సలూజ, తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ పరిశీలకులుగా శ్రీకాంత్, తెలంగాణ బలంపిక్ సంఘం పరిశీలకులుగా రవీందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికలరిటర్నింగ్ అధికారిగా శ్యాం వ్యవహరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సీఈవో, అధ్యక్షులుగా యశస్వి మల్క, ప్రధాన కార్యదర్శిగా శ్యామల పవన్ కుమార్, కోశాధికారిగా సంజీవ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గోనె శ్యాంసుందర్ రావు , రఫీయుద్దీన్, శ్రీకాన్త్, పింజా సురేందర్, సంయుక్త కార్యదర్శులుగా, రమేష్, లక్ష్మణ్ పుల్లయ్య, తిరుమల్ రెడ్డి ఎన్నుకున్నారు. తెలంగాణ హ్యాండ్ బాల్ సంఘం ఉపాధ్యక్షులుగా నిజాంబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నిక పట్లజిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు గంగా మోహన్ చక్రు,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి,హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాం, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.


మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు గా తలారి కిరణ్, ఉపాధ్యక్షులు దోనకంటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నీరడి వెంకటేష్ , కార్యదర్శి పరదేశి నరేష్ , కోశాధికారి అందె రమేష్ గౌడ్ సలహాదారులు తలారి రమేష్, తలారి ప్రభాకర్, గోప రాజు, కరికే నరేష్, చిట్టపురం పర్శరాములు, కోటగిరి పర్శరాములను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

13న మందకృష్ణకు ఘనస్వాగతం పలుకుదాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించిన తరుణంలో ఈనెల 13వ తేదీనా ఢిల్లీ నుండి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌కు వస్తున్నారని ఆయనకు ఘన స్వాగతం పలకడానికి ప్రతి గ్రామం నుండి మాదిగ సామాజిక వర్గ ప్రజలు తరలిరావాలని ఎంఎస్పి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అహర్నిశలు ఉద్యమ పోరాటాలు చేసి విజయాన్ని మోసుకొస్తున్న మహానుభావుడికి ఘన స్వాగతం పలకడానికి హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని,ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి మాదిగ,మాదిగ ఉపకులాల జనులందరూ తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరుతడే ఆధారం


సాగవుతున్న సోయాబీన్


పత్తిపంట


ఏపుగా పెరిగిన మొక్కజొన్న

- తగ్గుతున్న వరి సాగు
- సరిపడా వర్షాలు లేక నిండని చెరువులు
- జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా ఇప్పటివరకు భారీగా వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. ఆలస్యంగా ప్రారంభమైన వర్షాలు.. ముసురుకే పరిమితమైంది. భారీ వర్షాలు లేక చెరువులు, కుంటలకు నీరు చేరకపోవడంతో వరి సాగుపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. దీంతో ఆరుతడి పంటల సాగు వైపు దృష్టిసారిస్తున్నారు. దీంతో వరి సాగు విస్తీర్ణం తగ్గుతుండగా.. ఆరుతడి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది.

కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా రైతులు వరి పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. జిల్లా ఖరీఫ్ సీజన్లో 5 లక్షల 14 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో ముఖ్యంగా 3 లక్షల 13 వేల 965 ఎకరాలలో వరి పంట సాగు అవుతదని పేర్కొన్నాయి. అయితే ఇప్పటివరకు జిల్లాలో వరి సాగు 1 లక్ష 50 వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి.

జిల్లాలో నిజాంసాగర్, ఎల్లారెడ్డి, పాల్వంచ, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట్‌లో లోటు వర్షపాతం నమోదు అయింది. నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మూడు మండలాల్లో మాత్రమే సాధారణం కంటే కొద్ది మేర అధిక వర్షపాతం నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. ముసురు వర్షాలతో చెరువులు, కుంటలు నిండకపోవడంతో వరి సాగు చేసేందుకు రైతులు వెనకాముందు అవుతున్నారు.

గతేడాది ఇదే సమాయానికి రెండున్నర లక్షల మేర ఎకరాల్లో వరి నాట్లు పూర్తవగా.. ఈసారి ఇంకా లక్షన్నర ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తి చేసినట్టు సమాచారం. చెరువు ఆయకట్టు ప్రాంతంలో రైతులు వరి నాట్లు కొంతమంది రైతులు ఇప్పుడిప్పుడు వరి నాట్లు వేస్తున్నారు. కొంత మంది వేయడానికి ముందుకు రావడం లేదు. వరి నారుమల్లు ముదిరిపోయి, చెరువులో నీళ్లు లేకపోవడంతో వరి పంటపై కొందరు రైతులు ఆశలు వదులుకున్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు. మరో రెండు లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయకపోవడంతో వరి పంట సాగు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

ఆరుతడి పంటలే రైతులకు ఆధారం

ఖరీఫ్ సీజన్లో తొలకరిజల్లులకు ఆరుతడి పంటల సాగు చేసే రైతులు పెసర మినుము సోయా మొక్కజొన్న పత్తి ఇతర వాణిజ్య పంటలు సాగు చేసే రైతులకు చిరుజల్లులు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఆరుతడి పంటలు సాగుచేసిన రైతులకు ఎలాంటి రంది లేకుండా పోయింది. ఆరుతడి పంటలే వారికి ఆధారమైంది. ప్రస్తుతం ఆరుతడి పంటల్లో కలుపులు తీస్తూ మందులు పిచికారి చేస్తున్నారు.

జిల్లాలో ఆరుతడి పంటలు అయినా రెండు లక్షల ఎకరాలపై పంటలు సాగు అవుతాయని అధికారులు అంచనావేసినప్పటికీ.. ఇప్పటి వరకు అంతకుమించి సాగయినట్టు వ్యవసాయా ధికారులు తెలిపారు. సాధారణంగా మొక్కజొన్న 57 వేల ఎకరాలలో సాగు చేస్తారని అంచనా వేయగా.. ఇప్పటి వరకు అదనంగా మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా సోయాబీన్ 85 వేల ఎకరాలు పత్తి 28 వేల ఎకరాలు, కందులు 14 వేల ఎకరాలు పెసర్లు 5 వేల ఎకరాలతో పాటు మినుములు, జొన్న ఇతర వాణిజ్య పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, దోమకొండ, బిబిపేట్, పిట్లం, జుక్కల్, మద్నూర్ మండలాల్లో ఆరుతడి పంటలు అధికంగా అంచనాకు మించి సాగు చేస్తున్నారు.

జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదయిందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువులు కుంటలు నీళ్ల ఆశించిన స్థాయిలో చేరుకోలేదు. చెరువులు కుంటలు నిండలేదు. ముసురు కారణంగానే కొత్త మేరకు నీళ్ల వచ్చాయి. పెద్ద చెరువులో నీళ్ల లేక వెలవెలబోతున్నాయి.

జిల్లాలో నసురుల్లాబాద్, బాన్సువాడ, బీర్కూర్‌లలో అధిక వర్షపాతం నమోదయింది. నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ దోమకొండ, బీబీపేట్‌లో లోటు వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా సగటు 491 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 481 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదు అయింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయింది.

ప్రమాదవశాత్తు చెరులో పడి యువకుడు మృతి


మృతిచెందిన ప్రభాకర్

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావు పల్లి గ్రామంలో చెరువులో గేదెలను కడగటానికి వెళ్లి ప్రమాదవశత్తు నీటిలో పడి సంగి ప్రభాకర్ (27) అనే యువకుడు మృతిచెందినట్టు అని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తనకున్న గేదెలను చెరువులో కడిగే అప్పుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఈతరాక మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ఎంపీ సురేష్ షెట్కార్‌కు సన్మానం


ఎంపీ సరేశ్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సుధీర్ కుమార్ ఆదివారం నాడు జహీరాబాద్ ఎంపీ సురేష్ సెట్కారును కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు సుధీర్ కుమార్ ఎంపీకి సన్మానించగా ఆయన ఎన్ఎస్ యు ఐ అధ్యక్షునికి అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ధన్నూరు గ్రామ యువకులున్నారు.

ఘనంగా బోనాల పండుగ



నవతెలంగాణ-పిట్లం

మండల ంలోని గోధుమేగావ్ గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా బారెడు పోచమ్మ బోనాల పండుగను ఆదివారము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. బారెడు పోచమ్మకు గ్రామ ప్రజలు సన్నాయి, డప్పుల మధ్య ర్యాలీగా భారీ ఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. శ్రావణమాసం పురస్కరించుకొని తీపి వంటకాలతో అమ్మవారికి కొబ్బరికాయలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం పచ్చని వాతావరణం లో గ్రామ ప్రజలు బంధువుల , స్నేహితుల , కుటుంబ సభ్యులతో తీపి వంటకాలను ఆరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు , చిన్నారులు పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చుపెట్టొద్దు

- ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

నవతెలంగాణ-నసురుల్లాబాద్


రాస్తారోకో చేపట్టిన నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్వర్యంలో ఆదివారం బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. మాలమహానాడు పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల నుంచి మాలమహానాడు కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం బోధన్ బాన్సువాడ వెళ్లే రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గంట పాటు రాస్తారోకో చెయ్యడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడి అక్కడ నిలిచిపోయాయి. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలపై నినాదాలు చేశారు. వర్గీకరణ వద్దు కలసి ఉండడమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు కార్యదరి నీరడి ఈశ్వర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఈ తీర్పు దళితుల మధ్య చిచ్చుపెట్టెలా ఉందని విమర్శించారు. దీని వల్ల ఎస్సీ ఉప కులాలతో పాటు ఎస్టీలు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఈ తీర్పు సుప్రీంకోర్టు తీర్పులాగా లేదని.. ప్రధాని మోదీ స్క్రిప్ట్‌లా ఉందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఈ తీర్పు ఉందని, దీని వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు గౌడి నర్సింలు, మామిడి భూమయ్య, మామిడి చిన్న మక్కయ్య, ఉల్లేంగ కిరణ్, రెడ్డి శ్రీనివాస్, బంగారు మైశయ్య, లక్ష్మన్, లింగమయ్యా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిలో క్లోరిన్ పరీక్షలు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జలజీవన పథకం ద్వారా తాగునీటిలో క్లోరినేషనపై ఆదివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న తాగునీటి ట్యాంక్ లో ఉన్న నీటిని పరీక్షలు నిర్వహించారు. మంచి నీటిలో కలుషితమైన సూక్ష్మజీవులను, క్లోరిన్‌ను గుర్తించేందుకు జలజీవన పథకం ద్వారా పీఎచ ఏఫైర్ ల్యాబ్ టెక్నీషియన్లు వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారని తాగునీటి అధికారిణి అశ్విని తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని వాటర్ ట్యాంకులు, మంచినీటి బోర్లను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందుతోందని, ఇందులో భాగంగా కుళాయిల ద్వారా నీరు ఏ సమయానికి నీరు వదులుతారు అన్న సమాచారాన్ని ల్యాబ్ టెక్నీషియన ప్రత్యక్షంగా ప్రజలను అడిగి తెలుసుకుని మొత్తం 12 శాంపిల్‌లను పరీక్షించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి నీటిలో ఉన్న క్లోరిన శాతం ఏవిదంగా ఉంది నీటిలో ఏమైనా సూక్ష్మజీవులు కలిగి ఉన్నాయా అనే కోణంలో తెలుసుకుని వాటి ఆదారంగా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వీరి వెంట డిప్యూటీ ఇంజనీర్ వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, శక్రు , కార్యదర్శి రాజేష్ కారోబర్ రతన్ కుమార్, సలీం, మెకానిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌ను ప్రకృతినగర్‌గా మార్చుదాం

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

ప్రగతి నగర్ కాలనీని ప్రకృతి నగర్ గా మార్చుకుందామని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ప్రగతి నగర్ లో స్వచ్ఛధనం - పచ్చధనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు మానవ మనుగడకు జీవనాదారం అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలను నాటాలని అలాగే పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని రక్షించాలని సూచించారు, కాలనీలో కుక్కల బేడద ఉందని చెప్పగా కుక్కల బెడద లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. పార్క్ డెవలప్మెంట్ విషయంలో ఎల్లవేళలా కాలనీవాసులకు మా వంతు సహహ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జూలూరి సుధాకర్, పట్టణ కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, వనిత రామ్మోహన్, చాట్ల వంశీ, ప్రగతి నగర్ కాలనీ అధ్యక్షులు ఆకుల ప్రభాకర్, ఉపాధ్యక్షులు వడ్ల రమేష్, కోశాధికారి గురజాల వినోద్ కుమార్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

చురుకుగా కొనసాగుతున్న రోడ్డు పనులు


కొనసాగుతున్న పనులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్ర సమీపంలోని ఆదిపరాశక్తి మత్తడి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మండల కేంద్ర సమీపంలోని పెద్ద వాగు సమీపంలో మత్తడి పోచమ్మ ఆలయానికి రోడ్డు లేకపోవడంతో ఇక్కడి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. వర్షాకాలం వస్తే ఆలయం వద్దకు వెళ్లాలంటే భక్తులకు ఇబ్బంది కలుగుతుండేది. ప్రతి సంవత్సరం ఉగాది నుండి 15 రోజులపాటు అమ్మవారి జాతర ఉత్సవాలు రంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమ్మవారి వద్దా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గెలిచన తర్వాత అమ్మవారి ఆలయ వరకు రోడ్డు నిర్మాణం చేపడతామని అక్కడి భక్తులకు హామీ ఇచ్చారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని రెండు కోట్లు రూపాయలు రోడ్డు నిర్మాణానికి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు నిధులు మంజూరు చేశారు గత నెల రోడ్డు పనులకు టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించారు. భక్తులు ఇతర ప్రాంతాల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు అన్ని వర్గాల ప్రజలు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి రోడ్డు పనులు వేగవంతంగా చేపట్టడంతో ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయానికి 50వేల విరాళం


గ్రంథాలయం కోసం రూ.50 వేలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి (2005-2006) సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు నవీన్ రెడ్డి, విద్యాసాగర్ ఆధ్వర్యంలో 50 వేల రూపాయలను ప్రధానోపాధ్యాయులు నరసింహారావుకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చదువు కున్న పాఠశాల కు తమవంతుగా సహాయం అందించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల కృషిని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు అబినందించారు

పారిశ్రామిక వేత్త సుభాష్‌రెడ్డికి సన్మానం


సుభాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట మండలం లోని జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన నివాసం లో దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా కప్పి, మెమెంటోను అందించి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి, సిద్ద రెడ్డి,మధు, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం



ఒక్కచోట చేరిన 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని పైడిమర్రి ఫంక్షన్ హాల్‌లో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని సంతోషాలు పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు, పిల్ల పాపలు, మనుమలు మనమరాలతో గడిపారు. ప్రముఖులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాకర్ రావ్, బాల్ రెడ్డి, రాజలింగం, దేవేందర్ రావు, సుంచు గోవర్ధన్, బొడ్డుల రాం చెంద్రం, అశోక్, సత్య నందు, మూర్తి,బాల్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | ఆగస్టు 12, 2024 | www.navatelangana.com

వయనాడ్ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

నవతెలంగాణ-బోధన్



కేరళలోని వయినాడ్‌లో వరదలకు నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం బోధన్ పట్టణంలో విరాళాలను సేకరించారు. ఈ సంధర్భంగ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ బోధన్ పట్టణంలో కేరళ వరద బాధితుల సంఘీభావం నిధి సేకరించడం జరిగిందన్నారు.. ఈ కార్యక్రమానికి బోధన్ పట్టణంలోని ప్రజలు వ్యాపారులు తమ వంతు సహకారం ఇచ్చి తోడ్పాటు అందించినందుకు సిఐటియు జిల్లా కమిటీ తరపున ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చాంద్, అంజని రేఖ, శివలింగం రాములు, పోశవ్వ, నాగమణి శేషాబాయి మొదలగువారు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన 10మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం అందజేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామస్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మండలంలోని తొర్లికొండ గ్రామ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమలో జక్రాన్ పల్లి మండల ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనక రవి కుమార్, తొర్లికొండ గ్రామ అధ్యక్షులు తాజుద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముప్కాల్

చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు సంఘ సభ్యులు తెలిపారు. సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించి నూతన కార్యవర్గం ఎన్నిక, పలు తీర్మానాలను చేపట్టారు.. ఆగస్టు 15న పతాక ఆవిష్కరణ, చైతన్య పాత భవనం పునరుద్ధరణ, స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని నూతన సభ్యులను సంఘంలో చేర్చుకోవడం, నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలవాలని తీర్మానాలు చేశారు. చైతన్య సంఘం నూతన అధ్యక్షులుగా వంగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పల్లికొండ గోపీనాథ్, పెండం జీవన్, మొగిల సుదర్శన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గడ్డం రమేష్, సహ కార్యదర్శులుగా కనుగుట్ల లింగం, చింతల నర్సయ్య, దాసరి నర్సింగ్ దాస్, కోశాధికారి చిల్క సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మునీరుద్దీన్, సాంస్కృతిక కార్యదర్శిగా చిల్క నర్సయ్య, వై.నాగేంధర్, క్రీడల కార్యదర్శి మ్యాక మోహన్ దాస్, ఓజా కుశాలుడు, సలహాదారులుగా నునుగొండ అంజయ్య, మామిడ్యాల రవీందర్, అంగరేకుల నరహరి, రాజ్ వల్లభ్, ఏ.రాజేశ్వర్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

వైద్య ఖర్చుల కోసం..
మిత్రుల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన సూకల దశరథ్ వైద్య ఖర్చుల కోసం తమవంతుగా గ్రామానికి చెందిన పలువురు మిత్రులు రూ.23వేల 5 వందల ఆర్థిక సహాయం అందజేశారు. 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన దశరథ్ ఆర్మూర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దశరథ్ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున గ్రామస్తులు మంచి మనసుతో తోచినంత సహాయం అందించాలని వారి కుటుంబం కుటుంబ సభ్యులు స్థానిక సోషల్ మీడియా గ్రూపులో విన్నవించారు. దీంతో స్పందించిన ఎంతో మంది తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన బద్దం రాజశేఖర్ రూ.5వేలు, గోపిడి మహేష్, జడల మణికంఠ, గోపిడి రాజేందర్, గోపిడి రమేష్, సాయి రెడ్డి, అల్ల కొండ గంగాధర్ ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున, వైన్స్ సతీష్ రూ.15వందలు, గడ్డం స్వామి, తీగల హరీష్, సుభాష్ గౌడ్, చింత ప్రదీప్, గుండోజి రవీందర్ లు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మిత్రులు అందరూ కలిసి అందజేసిన ఆర్థిక సహాయం మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మొక్కలు నాటిన ఎస్‌జెడబ్ల్యూహెచ్‌ఆర్‌సి బాధ్యులు



మొక్కలు నాటుతున్న బాధ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్గట్ల కేజీబీవి పాఠశాలలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ, రాష్ట్ర బాధ్యులు మామిడాల మనోహర్, హనుమ గౌడ్, నోముల సంపత్ గౌడ్ ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటామని అన్నారు. ఏర్గట్ల కేజీబివి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం కావాలని, అప్పుడప్పుడు విద్యుత్ కొరత భాధిస్తున్నందున సొంత ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జెడబ్ల్యూ హెచ్‌ఆర్‌సి రాష్ట్ర, జిల్లా, డివిజన్ కార్యవర్గ సభ్యులు బట్టి దత్తాద్రి గౌడ్, కొప్పు రాజేందర్, కర్రె గంగాధర్, కుంట నవీన్, కట్కం సామంత్ రెడ్డి, కైరి నరేష్ గౌడ్, దావెల్లి ఎల్లయ్య మెల్ల రాజాగౌడ్, సాయిలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆరవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మొగులయ్య ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ధర్మపురి హిల్స్ రోడ్డులో ఓ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఉన్నట్లు స్థానికులు ఆదివారం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వ్యక్తి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఆరవ టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఉచిత సైకిళ్లకోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో "సైకిళ్ళతో బాలికలను శక్తివంతం చేద్దాం"అనే కార్యక్రమంలో భాగంగా మండలానికి చెంది, ఆర్థికంగా వెనుకబడి, ప్రభుత్వ పాఠశాలలో 8,9,10 చదివే బాలికల సౌకర్యార్థం సైకిళ్ళను పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు రోటరీ క్లబ్ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ నుండి బడి దూరంగా ఉండాలని, స్కూల్ స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్, తండ్రి ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు (కార్డులో బాలిక పేరు ఉండాలి), ఆధార్ కార్డు, కరెంటు బిల్లు జిరాక్స్ జత చేసి ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలోని బంజారా ఎలక్ట్రానిక్స్ షాప్‌లో ఇవ్వాలని పేర్కొన్నారు. ఈనెల 14వరకు సెల్ నం 9010005000 కు సంప్రదించవచ్చని తెలిపారు.

రక్తదానం చేయండి.. ప్రాణం నిలబెట్టండి

నవతెలంగాణ-రెంజల్

సంజీవని హాస్పిటల్ బైంసాలో రుక్మాబాయి అనే పేషెంట్ కు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్ ఆధారంగా రెంజల్ మండల కేంద్రానికి చెందిన దేవరాజ్ స్పందించడం అభినందనీయమని ఆసుపత్రి వర్గాలు వెల్లడించారు. ఆదివారం వాట్సాప్ లో చూసిన దేవరాజ్ రెంజల్ నుంచి సుమారు 65 కిలోమీటర్లు తన బైక్ పై వెళ్లి రక్తదానం చేయడం సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఆయనే ఇప్పటివరకు సుమారు 50 సార్లు హైదరాబాద్ తో పాటు వివిధ పట్టణాలలో రక్తదానం చేశారని వారన్నారు. యువత రక్త దానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని వారు పేర్కొన్నారు.

ఉత్సాహంగా తీజ్‌పండుగ

- నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్న గిరిజన యువతులు
- పాలిటెక్నిక్‌నుండి కలెక్టరేట్ మైదానం వరకు ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



ర్యాలీగా వెళ్తున్న యువతులు

గిరిజనుల పండగ తీజ్ ఉత్సవాలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో పెద్ద ఎత్తున మహిళలు, యువతులు, యువకులు కలిసి గిరిజనులు సాంప్రదాయ వేషాధారణలో ప్రత్యేక పూజలు చేసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. జగదంబ మాతకు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేకలను బలిచేసి అందరూ కలిసి భోజనాలు చేశారు. మహిళలు, యువతులు సాంప్రదాయం నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. బంజారా, లంబాడీ సంస్కృతి సాంప్రదాయానికి చాటి చెప్పే పండుగలలో అతి ముఖ్యమైనది తీజ్ పండుగ. తీజ్ అనగా గోధుమ మొలకలు అని అర్థం. ఈ పండుగను పెళ్ళి కాని అమ్మాయిలు శ్రావణ మాసంలో భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ బిలోజి నాయక్, డాక్టర్ మోతిలాల్, చాంగు బాయ్, చంద్రకళ, సులోచన, మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా బంజార సభ్యులందరికీ తీజ్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తు తరాలకు తమ తీజ్ పండగ ప్రాముఖ్యతను తెలపడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తరతరాల నుండి వస్తున్న బంజారా సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం పండగ ముఖ్య ఉద్దేశమని అన్నారు. శ్రావణ మాసంలో వచ్చే రాఖీపూర్ణిమ రోజు ప్రారంభమై గోకులాష్టమి రోజున ముగుస్తుంది అని తెలియజేశారు. పెళ్ళికాని అమ్మాయిలు అందరు పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు. పెళ్ళికాని ఆడ పిల్లలు వెదురు బుట్టల్లోనే కాకుండా మోదుగు ఆకులతో గుల్లగా చేసి అందులో మట్టిని పోసి, గోధుమలని చల్లుతారని తెలిపారు. ఆడపిల్లలు పులియాగెణో పూర్ణకుంభం తలపై పెట్టుకొని బావి నీళ్లకాని, బోరింగ్ నీళ్ళకాని, చెరువు నీళ్లకాని, తీసుకు వచ్చి తీజ్ కి పోస్తారని అన్నారు. ఈ కార్యక్రమం జరిగేటప్పుడు పెళ్ళికాని మగపిల్లలు తీజ్ కి నీళ్ళ పోయ్యనివ్వకుండా ఆపి కొన్ని పొడుపు కథలు వేస్తారని, వాటికి సమాధానం చెప్పినవారికి తీజ్ కి నీళ్ళు పొయ్యనిస్తారని తెలిపారు. ఈ విధంగా రోజుకు మూడు పూటలా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ నీళ్ళు జల్లుతూ అగరు బత్తులతో దూపం చేస్తూ నైవేద్యం పెడుతూ ఆనందంగా ఈ పండుగను నిర్వహించుకుంటారు అని క్లుప్తంగా వివరించారు. పాలిటెక్నిక్ మైదానం నుండి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ మైదానం వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బంజారాల యువతి, యువకులు, వారి తల్లిదండ్రులు, బంజారా కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తీజ్‌లో పాల్గొన్న బంజారా మహిళలు, తదితరులు

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



భూమిపూజలో పాల్గొన్న వీడీసీ సభ్యులు

మండలంలోని ఉప్లూర్ లో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అర్చకులు పవన్ పంతులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రస్తుతం ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయం పురాతనమైనది కావడం, పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించారు. ఆలయ నిర్మాణం కోసం గ్రామంలో చందాలను పోగు చేశారు. సుమారు రూ.12 లక్షలతో మహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్ తెలిపారు. సాధ్యమైనంత మేర ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి భక్తులు పూజలు చేసుకోవడానికి అందుబాటులో తీసుకొస్తామని ఆయన తెలిపారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించే దాతలు ఎవరైనా ఉంటే గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమ్ముల రవీందర్, చింతకుంట శ్రీనివాస్, బద్దం ధన్ రెడ్డి, డాకూరి శ్రీనివాస్, అశ్వపతి, డాకూరి శ్రీధర్, శివ, సాంబారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్టడీహాల్ ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ భవనంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం స్వామి వివేకానంద స్టడీ హాల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు రిటైర్డ్ ఉపాధ్యాయులు మర్యాల నాగభూషణం గుప్త, ఉపాధ్యాయులు గుండోజి రవీందర్, సల్లూరి కిషన్ గౌడ్ తెలిపారు. అన్ని సౌకర్యాలతో ఉచితంగానే స్టడీ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. స్టడీ హాల్లో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ చైర్, స్టడీ ప్యాడ్, ఉచిత వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. వివిధ రంగాలకు చెందిన పలువురు నిపుణులు స్టడీ హాల్‌ను సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు పలు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు.మంచి సదా అవకాశం సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు విజయపథంలో ప్రయాణించాలని సందర్భంగా వారు ఆకాంక్షించారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- తారచంద్ నాయక్‌కు స్వగ్రామంలో స్వాగత సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న తారాచంద్‌నాయక్

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటి సారి డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) గ్రామానికి రావాడంతో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ అద్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి రాంపూర్ డి సహకార సొసైటీ పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, సహకార సొసైటీ డైరెక్టర్లు,రైతులు పాల్గొని మాట్లాడుతూ తారాచంద్ నాయక్ అందరి వారని, గత రెండు సార్లు సొసైటి చైర్మన్ గా ఎన్నికై నేడు ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరుల సహాయ, సహకారాలతో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ చైర్మన్ గా ఎన్నుకోవడం అభినందనమన్నారు.

రాంపూర్ సహకార సొసైటీ నష్టాల బాటలో ఉన్నప్పుడు విశేష కృషి చేసి లాభాల బాటలోకి తీసుకుని వచ్చారని ఇదంతా చైర్మన్ తారాచంద్ నాయక్ కు దక్కుతుందని వారన్నారు.

సన్మాన కార్యక్రమం అనంతరం ఐడిసిఎంఎస్ చైర్మన్ తారా చంద్ నాయక్ మాట్లాడుతూ ఐడిసిఎంఎస్ చైర్మన్ పదవి రావడానికి ఎందరో కృషి చేశారని వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. సోసైటి పరిధిలోని ఆయా గ్రామాలలో నాబార్డ్ ద్వారా సోసైటి భవన నిర్మాణం చేపట్టి, ఇతర గ్రామాల్లో మార్కెట్ యార్డ్ నిర్మిస్తామని అన్నారు. అంతకు ముందు గ్రామంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిచ్ పల్లి మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, నర్సయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలసని శ్రీనివాస్, రాంపూర్ తాజా మాజీ ఉప సర్పంచ్ ఎంకనోల్ల రమేష్,మాజీ ఉప సర్పంచ్ల ఫోరం మండల కన్వీనర్ రఘునథన్ రాము, మాజీ సర్పంచ్లు తిరుపతి,అశన్న, బాల్ రామ్ నాయక్, గాంధారి రాజు, మాజీ ఎంపిటిసి చింతల దాస్, డైరెక్టర్లు రాజ్ కుమార్, బొక్క గంగాధర్, మెకల రమేష్, కాంగ్రెస్ మండల కార్యదర్శి లచ్చమొల్ల దత్తాద్రి, ఇంచార్జీ సిఈఓ నాగేశ్వరరావు, మహిపాల్ నాయక్, రవి, లచ్చమొల్ల రాజు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

గుంతలమయంగా రోడ్లు

- ప్రమాదకరంగా దండిగుట్ట నుంచి దూపల్లి రోడ్డు
- నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలం దండిగుట్ట నుంచి దూపల్లి గేటు వరకు నిర్మించిన ఆర్ అండ్ బి రోడ్డుపై గుంతలు ఏర్పడి నీరు నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సుమారు ఐదు కిలోమీటర్ల ఈ రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వర్షాకాలంలో నీరు నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మొత్తంలో ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ప్రతిరోజు ఈ రోడ్డుపై వందలాది వాహనదారులు వివిధ పనుల కోసం నిజామాబాద్ వెళ్తుంటారు. ఈ రోడ్డు కుండా కందకుర్తి, తాడు బిలోలి బస్సులు సైతం వెళుతూ ఉండడంతో గుంతల్లో నీరు నిండడంతో వారికి సైతం అవస్థలు తప్పడం లేదు. కొంతమంది ఆటోల వారు నవీపేట్ మీదుగా దూరమైనప్పటికీ వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు గుంత మండల కేంద్రం నుంచి అనేకమంది ప్రతి రోజు ద్విచక్ర వాహనాలపై నిజామాబాద్ వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు ఈ రోడ్డు పరిస్థితులపై అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని మండల వాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డు పై పడ్డ గుంతలను ప్యాచ్ వర్క్ అయిన వేసి తమ కష్టాలను దూరం చేయాల్సిందిగా మండల ప్రజలు కోరుతున్నారు.

నరాల వైద్యం మరింత చేరువ



ఆస్పత్రిని ప్రారంభించిన ఐఎంఏ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీ

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నరాల వ్యాధితో ఇబ్బంది పడకుండా సులభతరమైన వైద్యం అందించేందుకు నిజామాబాద్ నగరంలో ఏర్పాటు చేశామని, జిల్లా ప్రజలకు నరాల వైద్య సమస్య పరిష్కరించేందుకు జిల్లా ప్రజలకు చేరువైందుకు ఇక్కడ ఏర్పాటు చేసినట్టు డాక్టర్ గోవీన్ మంద అన్నారు. నిజామాబాద్ నగరంలోని ఖలీల్ వాడి ప్రాంతంలో శ్రీ భవాని కేర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనంలో న్యూరాలజీ ప్రత్యేక విభాగాన్ని ఆదివారం ముఖ్య అతిథులుగా ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బి.దామోదర్ రావు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ శ్రీశైలం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోవీన్ మంద మాట్లాడుతూ నరాల సమస్యలతో బాధపడే వారికి సులభమైన పద్ధతిలో, సురక్షితంగా వ్యాధినయమయ్యే విధంగా చికిత్స అందించబడునని అన్నారు. నరాల వ్యాధితో బాధపడేవారు ఎవరు ఎటువంటి ఇబ్బందులకు లోను కావాద్దని, ఎన్ని రకాల నరాల సమస్యలు ఉన్న ఎటువంటి ఉద్రిక్తత పడకుండానే చికిత్స నయం చేసుకోవచ్చని, నరాల వ్యాధులు రావడంతో మానసికంగా ఇబ్బంది పడి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎ.అరవింద్ రెడ్డి , భారత్ ల్యాబ్ లింగారెడ్డి ఆసుపత్రి మేనేజ్మెంట్ గోపాల్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిఓడబ్ల్యు నిజామాబాద్ జిల్లా 7 వ మహాసభ నగరంలోని ద్వారక నగర్ ఐఎఫ్టీయు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా మహాసభలో పిఓడబ్ల్యు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలుగా ఆకుల అరుణ (నిజామాబాద్), ఉపాధ్యక్షులు యం.లక్ష్మి(బాల్కొండ), అగ్గు సునీత(మోపల్), జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి (మెంట్రాజ్ పల్లి), సహాయ కార్యదర్శులుగా పుష్పలత(బోధన్), లాస్య(ఆర్మూర్), కోశాధికారిగా జి.సంజన(నిజామాబాద్), జిల్లా కార్యవర్గ సభ్యులుగా విజయలక్ష్మి(బోధన్), చిట్టెక్క(ఆర్మూర్), వి.పద్మ(దర్పల్లి), వెల్పూర్ లక్ష్మి(తడెం), దేశెట్టి రాధ (బొర్గం-పి), నీలం లక్ష్మి(నిజామాబాద్), మహ్మద (ఆర్మూర్), టి.లక్ష్మి (రాంపూర్), స్వప్న (నిజామాబాద్)ను ఎన్నుకున్నట్టు రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ వివరించారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. మనువాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలని, మద్యానికి వ్యతిరేకంగా, అశ్లీల సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని, జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని తీర్మానించారు.

అంధకారంలో అంతక్రియలు

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లక్షలు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మిస్తే వాటిలో నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు లేవు అనడానికి నిదర్శనం ఇదే. శనివారం రాత్ర ఎడపల్లి మండలంలోని తానాకాలన్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందగా అంతక్రియలు అంధకారంలోకొనసాగాయి. రాత్రి వేళలో అంత్యక్రియలకు వెళ్లిన గ్రామస్తుల ఇబ్బందులు చెప్పుకోలేనివి. ఠానాకలన్ గ్రామానికి చెందిన ఇందూరి గణపతి (55) శనివారం మధ్యాహ్నాం గుండెపోటుతో మృతి చెందాడు. అదేరోజు చిమ్మ చీకట్లో వైకుంఠధామంలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలు వెచ్చించి వైకుంఠధామలు నిర్మించిన అక్కడ విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేయకపోవడం వల్ల గ్రామస్తులు వ్యక్తం చేశారు ఇప్పటికైనా అధికారులు మేల్కొని తగిన సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు.

దేశానికి రక్షా : అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

7వ డివిజన్ శాంతి భవన్‌లో బ్రహ్మకుమారీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షా బంధన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈసందర్భంగా బ్రహ్మకూమారీలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతు సోదరాభావానికి ప్రతీకగా భారతదేశం అంత జరుపుకునేది రాఖీ పండుగ అనాదిగా వస్తుందని అన్నారు. ఈరాఖీ అనేది అన్న -చెల్లికి, అక్క - తమ్మునికి రక్షాగా ఉంటు మనమంతా ఈ దేశానికి భరతమాతకు రక్షా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఓం శాంతి భవన్ సభ్యులు .వనజ, సుజాత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, 7వ డివిజన్ కార్పొరేటర్ సుక్క మధు, బీజేపీ నాయకులు ఇప్పకాయల కిషోర్, మఠం పవన్,కిరణ్,దీపక్, బాబీ సింగ్, శేఖర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణను పదేండ్లు అంగడి చేసి అమ్ముకుండు

- కేసీఆర్‌ది గడీల దొలర ఫ్యూడల్ మనస్తత్వం
- కామారెడ్డి ధూంధాం సభ కోట్ల మందికి స్ఫూర్తి
- ప్రముఖ కవి, రచయిత, గాయకుడు అందె శ్రీ

నవతెలంగాణ-కామారెడ్డి

'రాష్ట్ర సాధన ఎజెండాగా సబ్బండ వర్ణాల ప్రజలు ఉవెత్తిన ఉద్యమం చేసి తమ కలల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేసుకున్నారు. ప్రజాపోరాటంతో ఏర్పడ్డ తెలంగాణను పదేండ్ల పాటు కేసీఆర్ అంగడి చేసి వనరులు అమ్ముకున్నాడు. రాష్ట్రాన్ని ఆగం చేసిండు. కేసీఆర్‌ది గడీల దొరల ఫ్యూడల్ మనస్తత్వం అని' ప్రముఖ కవి, రచయిత, గాయకుడు అందె శ్రీ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లాలోని బీబీపేట్ మండలం జనగామ గ్రామ నివాసి అయిన ప్రముఖ వ్యాపారవేత్త, విద్యాప్రదాత తిమ్మయ్య గారి 53వ జన్మదినం సందర్భంగా జనగామ గ్రామానికి వచ్చిన అందే శ్రీ విలేకరులతో తెలంగాణ ఉద్యమ విషయాలను పంచుకున్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపురిపోసింది కామారెడ్డి ధూంధాం ఉద్యమ సభ అని అన్నారు. 80 వేల మందితో అర్ధరాత్రి ఒంటిగంట వరకు కామారెడ్డి ఉద్యమ సభ విజయవంతంగా కొనసాగిందని ఈ సభ తెలంగాణలోని కోట్ల మందికి స్ఫూర్తినిచ్చింద న్నారు. రాష్ట్ర సిద్ధికి కామారెడ్డి సభ పుట్టుక పొత్తిలి అన్నారు. ఏడు ధూంధాం సభలతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున విస్తరించిందన్నారు. కళాతోరణం ధూంధాం సభతో గద్దర్ కు పునర్జీవనం పోసిందని, సిద్ధిపేట ఉద్యమ సభలో నలుగురు మంత్రులు కిందనే కూర్చున్నారన్నారు. మలిదశ ఉద్యమానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పురుడు పోసిందనీ, 7 ధూంధాం సభలకు నాయకత్వం వహించి ఆర్ట్స్ కాలేజ్ సభతో తాను తప్పుకున్నట్టు తెలిపారు. మంచిర్యాల గోదావరి తీరంలోని సీతారాంపురం సభకు ఇసుక వేస్తే రాలని జనం వచ్చారని, 2002 సెప్టెంబర్ 30న కామారెడ్డి ధూంధాం సభ చరిత్రలో నిలిచిందన్నారు. సాంస్కృతిక ఉద్యమ సేనాని కోసం ధూంధాం చేపట్టాం అని, ఎన్ని చేసి కొట్లాడిన తెలంగాణను పదేండ్ల పాటు కేసీఆర్ అంగడి చేసి వనరులు అమ్ముకున్నాడని అన్నారు. రసమయి బాలకిషన్ సిద్దిపేట బానిస గడి జీతగాడిగా మారాడని, కెసిఆర్ లాంటి కొందరు మాది మా జెండా అని స్వార్థం చూపారన్నారు. కుల మతాల అతీతంగా తెలంగాణ ఉద్యమం ధూంధాం ఉద్యమంతో కెసిఆర్‌కు సంబంధం లేదన్నారు. జయ జయ హే తెలంగాణ గీతానికి రాష్ట్ర గౌరవంతో సంతృప్తి చెందానని తెలిపారు. కళాకారులు, కవులు, ప్రజలు కదిలి ఉద్యమం చేస్తే సభలకు లీడర్లు ఇంధనం, ధనం సమకూర్చారు. ధూమ్ ధామ్ ఉద్యమం సైనిక చర్యగా కోట్లాదిమందిని నిద్రలేపిందన్నారు. గూడా అంజన్న, గోరేటి వెంకన్న, అందెశ్రీ, జయరాజ్, రసమయి, అంతపుడుల నాగరాజు అంత కూడా ఆటపాటలతో ఉద్రూతలూగించారన్నారు. లలిత కళాతోరణం ధూంధాం సభతో గద్దర్ అన్న తిరిగి పునర్జీవనం ప్రారంభించారు. గద్దర్ రాకతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసి పడిందని, ఆటపాటల ఉద్యమం సాంస్కృతిక పోరాటం కోట్లాదిమంది తెలంగాణ ప్రజలను నిద్రలేపిందని అన్నారు.



మాట్లాడుతున్న అందె శ్రీ

కోట్లాదిమందికి నిద్ర లేకుండా చేసిందని అన్నారు.

'జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా రేవంత్‌రెడ్డి సర్కారు గుర్తించడంతో సంతృప్తి కలిగించింది. కెసిఆర్ దొర అహంకారి ఫ్యూడలిస్ట్ ఒకప్పుడు సిద్ధిపేట ఇప్పుడు సిద్ధిపేట దొంగల గడి మాత్రమే. తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమాలు భారతదేశ చరిత్రలో ప్రత్యేక ఉద్యమాంశాలు సంగీతం డబ్బు చప్పులు ఆటపాటలు జానపదాలతో ఉద్యమం నలుదిక్కుల విస్తరించిందన్నారు. కెసిఆర్ సర్వం అబద్ధాలకోరు అని, తెలంగాణ ఉద్యమంలో ఆటలు, పాటలు గాయకుల నాట్యాలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు. కళాకారులు, కవులు, రచయితలు, నాట్యకారులు, గాయకులు ఉద్యమాన్ని విస్తరించారనీ, అంతపుడుల నాగరాజు డ్యాన్సులు లక్షల మందిని ఉద్యమము వైపు లాగిందన్నారు. ఇంత చేసి సాధించుకున్న తెలంగాణను కెసిఆర్ దొర తన అహంకారంతో ఈ 10 ఏళ్లలో తెలంగాణను ఆగం చేసిండన్నారు.

ఎస్ఆర్ ఫౌండేషన్ రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలం జనగామ గ్రామంలో సామాజిక సేవకుడు తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం విజయవంతమైందనీ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు అన్నారు. శిబిరంలో 44 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన యువకులను అభినందించి,రక్తదాతలకు ప్రశంస పురస్కారాలను అందజేశారు. జన్మదినాన్ని పురస్కరించుకొని రామ్ రెడ్డి పల్లెలో వాటర్ ప్లాంట్లను సొంత ఖర్చుతో ఏర్పాటు చేశానని అభిమానుల మధ్యలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, రవీందర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, బాశెట్టి నాగేశ్వర్, భూమాగౌడ్, సుతారి రమేష్, గాడి లింగం, వెంకట్ రెడ్డి, స్వామి, కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు జమీల్, సలహాదారులు రమణ తదితరులు పాల్గొన్నారు.

మార గుడాడి నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఆదివారం మార గుడాడి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అద్యక్షులుగా మారమహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మార తిరుపతి రెడ్డి, కార్యదర్శి మార నవీన్ రెడి సహాయ కార్యదర్శి ఏనుగు రాజు కోశాధికారి మార శ్రీనివాస్ రెడ్డి , సహా య కోశాధికారి మార నర్సరెడ్డి ,డైరెక్టర్ లు మార పెద్ద గంగా రెడ్డి, మార మోహన్ రెడ్డి, మార బాల్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

స్వతంత్ర సమరయోధునికి సన్మానం



స్వతంత్ర సమరయోధుని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలోనిలోని పట్టణానికి చెందిన క్షత్రియ స్వాతంత్ర సమరయోధుడు డిజే.శివాదాస్ 94 వ జన్మదినాన్ని వారి కుటుంబ సభ్యులు ఆదివారం ఘనంగా స్వగృహంలో నిర్వహించినట్టు ఆయన కొడుకు డిజే దయానంద్ రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు, మనుమడు లయన్ నివేదన్ గుజరాతి లయన్స్ క్లబ్ అఫ్ ఆర్మూర్ గ్రీన్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ తెలిపారు. జన్మదినం జరుపుకుంటున్న శివదాస్ మాట్లాడుతూ జన్మదిన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు నాకు చాలా ఆనందం, ఉత్సాహం, లభించిందని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి ఉండాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు డీజే లత, గుజరాతి గీత, ప్రశాంతి, వినంతి,డిజె సులోచన, డిజె ప్రేమ్ నాథ్, ఉమా, మీరాబాయి, నిర్మల, మమత, జ్యోతి, స్వాతి, హీరాబాయి, శాంతి నిహారిక,వికాస్ జైనంద్,సాయి ఆవేదన్, తదితరులు పాల్గొన్నారు.

పైపుల రాజిరెడ్డి మరణం..సమాజానికి తీరని లోటు

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రముఖ పారిశ్రామికవేత్త సమాజ సేవకుడు పైపుల రాజిరెడ్డి మరణం సమాజానికి తీరని లోటని, ఆయన జక్రాన్ పల్లి గ్రామ ప్రజల గుండెల్లో నిలిచిపోయాడని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. పైపుల రాజిరెడ్డి శనివారం రాత్రి 11 గంటల 30 నిమిషాలకు మరణించడంతో ఆర్మూర్ మండలం అంకపూర్ లాలన ఆశ్రమంలో ఆదివారం జరిగిన ఆయన అంతక్రియలు హాజరై పార్థీవ దేహానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ



నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే

ద్వారా ఎందరో పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. లాలన వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి నీడ లేని ఎందరో వృద్ధులకు బాసటగా నిలిచారంటూ ఆయన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేరుకున్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో హై స్కూల్ నిర్మాణాన్ని తన భుజాల పైన వేసుకుని గ్రామ ప్రజల ద్వారా విరాళాలు సేకరిస్తూ, తన కుటుంబ సభ్యులు ఉన్నత స్థానంలో ఉండడంతో వారి ద్వారా కూడా అధిక మొత్తంలో విరాళాలను సేకరించి, తన సొంత డబ్బులను ఉపయోగించి రెండు అంతస్తుల పాఠశాలను నిర్మించి జక్రాన్ పల్లి గ్రామ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జక్రాన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సర్పంచులు, రెడ్డి పరివారం పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో హర్ ఘర్ తిరంగ నిర్వహించాలి

నవతెలంగాణ-దోమకొండ

ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దోమకొండ మండల కేంద్రంలోనీ ఆయా వార్డుల లో ఇంటింటికీ జాతీయ జెండా ను కామారెడ్డి శాసన సభ్యులు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు నియోజకవర్గం పరిధిలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురా వేయాలని సూచించారు. స్వాతంత్ర సమర యోధుల త్యాగాలు స్మరించుకోవడం అందరి భాధ్యత అని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించాలనీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు భూపాల్ రెడ్డి మనోజ్,రవీందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్నిదానం గది నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహించిన్న పూజారి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ సారంగ గుట్టపై అయ్యప్ప ఆలయం ఆవరణలో సన్నిధానం గది నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. కొద్ది నెలల క్రితం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు దాతల సహకారంతో సారంగా గుట్టపై అయ్యప్ప ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయితే గుట్టపై ఆలయం తప్ప భక్తుల సౌకర్యార్థం కానీ, అయ్యప్ప స్వాములు ఉండేందుకు ఎలాంటి గదులు లేవు. దీంతో రానున్న రోజుల్లో అయ్యప్ప మాలధారణ స్వాములు గుట్టపైనే ఆలయం వద్ద ఉండేలా ఏర్పాట్లు చేయడంలో భాగంగా సన్నిధానం గది నిర్మాణానికి సంకల్పించారు. అందులో భాగంగా ఆలయ పూజారి ఆధ్వర్యంలో గురుస్వామి మేడారం భూమన్న చేతుల మీదుగా సన్నిధానం గది నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. నవంబర్ నెల చివరి నాటికి సన్నిధానం గది నిర్మాణం పూర్తి చేసి అయ్యప్ప మాల ధారణ స్వాములు ఉండేలా అన్ని సౌకర్యాలతో అందుబాటులో తీసుకొస్తామని ఈ సందర్భంగా గురుస్వామి భూమన్న తెలిపారు. కార్యక్రమంలో భక్తులు చిలుకూరి నవీన్, బైండ్ల శ్రీనివాస్, వుత్తూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృథాగా ఎస్సీ హాస్టల్ సొంతభవనం



ఎస్సీ హాస్టల్ భవనం

- కుక్కలు పందుల తిష్ట
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పట్టించుకునే వారు కరువు

నవతెలంగాణ కమ్మర్ పల్లి

సొంత భవనాలు లేక అద్దె భవనాలతో అవస్థలు పడుతున్న వైనాలు ఒక పక్క అయితే... నిక్షేపమైన సొంత భవనాలు నిరుపయోగంగా మారిపోతున్న పట్టింపు లేని నిర్లక్ష్యం మరోవైపు పలు ప్రభుత్వ శాఖల్లో సర్వసాధారణంగా మారింది. కమ్మర్పల్లి మండల కేంద్రంలో రూ. 80 లక్షల వ్యాయామంతో నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన ఎస్సీ హాస్టల్ సొంతభవనం ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది..

నిర్మాణం జరిగి చాలా కాలం గురుకుల పాఠశాలగా కొనసాగిన ఈ భవనం ఆరేండ్లుగా మూలనపడి కుక్కలు, పందులు, పశువులు, పారిశుధ్య లోపానికి నిలయంగా... అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇదే అదనుగా కొందరు ఆకతాయిలు ఈ వసతి గృహాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మలుచుకొని కార్యకలాపాలు కొనసాగిస్తుంటే.... మరికొందరు చేతివాటం ప్రదర్శిస్తూ భవనం గదుల్లో ఉన్న విద్యుత్ పరికరాలు, తలుపులు కిటికీలు ఊడదీసి ఎత్తుకుపోయారు. నిక్షేపమైన భవనాన్ని వినియోగంలోకి తెచ్చుకునే అవకాశం ఉన్న అధికారులు ఆ మేరకు దృష్టి సారించకపోవడం విచారకరం.

2013-14 సంవత్సరంలో కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారికి సమీపంలో తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీఎస్పీ నిధులు రూ.80 లక్షలతో ఎస్సీ బాలుర వసతి గృహం కోసం సొంత భవనం నిర్మించారు. విశాలమైన 8 గదులతో నిర్మించిన ఈ భవనాన్ని జులై 7, 2015లో బాల్కొండ శాసన సభ్యులుగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కొంతకాలం వరకు ఎస్సీ బాలుర వసతిగృహం ఈ భవనంలో కొనసాగింది. 2017లో బాల్కొండ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని మానాలకు గిరిజన బాలికల గురుకుల పాఠశాల మంజూరు అయ్యింది. మంజూరైన కొంతకాలానికి మానాలలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణం ప్రారంభమైంది. దీని నిర్మాణం కొనసాగుతుండగానే గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు, తరగతులు, బోధన ప్రారంభమయ్యాయి. దీంతో కమ్మర్‌పల్లిలో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్ సొంత భవనంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తెచ్చిపెట్టి, అందులో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్‌ను మండలంలోని చౌట్ పల్లిలో గల మరో హాస్టల్ భవనంలోకి తరలించారు. మానాలలో గిరిజన బాలికల గురుకుల హాస్టల్ సొంత భవనం పూర్తయ్యే వరకు సౌలభ్యంగా ఉండడానికి ఇదంతా చేశారు బాగానే ఉంది. కానీ అటు తర్వాత కొంతకాలానికి కమ్మర్ పల్లిలో ఎస్సీ హాస్టల్స్ సొంత భవనంలో కొనసాగుతున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి తరలించారు. దీంతో కమ్మర్ పల్లి ఎస్సీ హాస్టల్ సొంత భవనం ఖాళీగా మారిపోయింది. చౌట్ పల్లికి తరలించిన ఎస్సీ హాస్టల్ ను తిరిగి కమ్మర్ పల్లిలోని సొంత భవనానికి మార్చలేదు. ఖాళీగా మారిన భవనంలో ఇంకా ఏదేని పాఠశాల హాస్టల్, ఏదేని ప్రభుత్వ కార్యాలయానికి కానీ వినియోగించలేదు. దీంతో భవనం నిరుపయోగంగా మిగిలిపోతున్నది. మోర్తాడ్ మండల కేంద్రంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో, అరకొర వసతుల మధ్య ఇబ్బందుల కొనసాగుతున్న దానిని కమ్మర్ పల్లిలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ సొంత భవనంలోకి మార్చాలని డిమాండ్లు విద్యార్థులు తల్లిదండ్రుల నుండి, విద్యార్థి సంఘాల నుండి వినిపించాయి.కానీ అధికారులు స్పందించలేదు. కమ్మర్ పల్లి మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, మూడు గదుల్లో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఈ జూనియర్ కాలేజీకి సొంత భవనం సమకూరే వరకు నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలో సౌకర్యవంతంగా నిర్వహించుకునే వీలుంది కదా అనే అభిప్రాయాలు వ్యక్తమైన అధికారులు పట్టించుకోలేదు. దీంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది.

తలుపులు, కిటికీలు దొంగల పాలు....

ఎస్సీ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండడంతో అందులోని తలుపులు, కిటికీలు దొంగలు ఎత్తుకెళ్లారు. కిటికీల అద్దాలను పగలగొట్టి, కిటికీ గోడల్లో ఉన్న ఇనుప చువ్వలను ఊడబీకి మరీ ఎత్తుకెళ్లారు. ఆకతాయిలు రాత్రి వేళల్లో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మార్చుకుంటున్నారు. భవనంలోని వరండా అంత పగుళ్లు వచ్చి శిథిలంగా మారింది. వర్షాలు కురుస్తుండడంతో భవనం లోపల, బయట భవనం చుట్టూ అడుగుమేర వర్షపు నీరు చేరి ప్రస్తుతం భవనంలోకి వెళ్లే మార్గం లేకుండా పోయింది. ఇప్పటికే భవనం మెట్లు పగుళ్లు ఏర్పడి కూలిపోతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే రాబోయే రోజుల్లో భవనం పూర్తిస్థాయిలో శిథిలంగా మారే అవకాశం ఉంది. సోషల్ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు దృష్టి సారించి సమన్వయంతో భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.



వరండాలో పగిలిన బండలు



కిటికీలు లేని దృశ్యం

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆటో డ్రైవర్స్ కు ఇచ్చిన హామీలు నెరవేర్చి ఏఐటీయూసీ నాయకులు అన్నారు. పట్టణంలోని మిలన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్యదర్శి ఆరెపల్లి సాయిలు విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో డ్రైవర్స్‌కు సంక్షేమ బోర్డు తో పాటు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికి హామీని నిలబెట్టుకోలేదన్నారు. తక్షణమే ఆటో డ్రైవర్స్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టాలని ఆయన అన్నారు.. గ్రామానికి ఇద్దరి చొప్పున 64 మందితో డివిజన్ నూతన కమిటీతో పాటు 20 మంది యాక్షన్ కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బక్కన్న, శుభాష్, శ్రీనివాస్, గురువయ్య, రమేష్, రాజేశ్వర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.